# నేనెవర్ని?

సూరేపల్లి విజయ

**ఈ ప్రశ్న నా చిన్నప్పట్నుంచి నాతో వుంటూ, నాతోనే పెరుగుతూ వచ్చిం ది. ఇప్పుడు ఈ వయసులో ఇలా అనుకోవాల్సి రావడం నా దురదృష్టమా? కాదు ఖాదస్తం అంటారు నా పిల్లలు.**

అవును...! నా పిల్లలు చాలా గొప్ప పిల్లలు. వజ్రాలు, వైఢూర్యాలు, మరకత మాణిక్యాలు. కాకపోతే ఈ వయసులో వాళ్ళకోసం ధారపోసిన నా రక్తానికి కూడా ఖరీదు కడతామంటారా? ఎవరికోసం చేసావు? ఎందు క్కన్నావు? అంటూ నిలదీస్తారా?

ఒక వజ్రమేమో బ్యాంకులో ఆఫీసర్. మరో వైఢూర్యం రైల్వేలో ఆఫీసర్. ఇక ఇద్దరు మరకత మాణిక్యాలు పెద్ద కంపెనీలో ఉద్యోగాలు వెలగబెడుతున్నారు. నలుగురు కొడుకులు...

"ఫ్యామిలీ ప్లానింగ్ లేకుండా ఇదేమిట్రా ముకుందం?" అని నా చిన్ననాటి స్నేహితుడు సుందర రామయ్య ఇరవయ్యేళ్ళ క్రితమే నన్ను కడిగేసినప్పుడు నవ్వి అన్నాను "రేపు నేను పోతే నన్ను మొయ్యడానికి నలుగురు కావాలిగా. బయటివాళ్ళు దొరుకుతారో లేదో... అందుకే" అన్నాను.

పాపం! చచ్చి ఎక్కడుందో నా ధర్మపత్ని... నలుగురిని కని, నన్ను వెన్నంటి సాధించిన ఆమె అర్జెంట్ పని వున్నట్టు వెళ్ళిపోయింది. బతికినన్నాళ్ళు నాకు శత్రుపక్షంగానే ఉంది.

ఇప్పుడు వర్షం వస్తోంది. ఓ చిన్న ఇరుకు గదిలో, ఇంటి కప్పు చిన్నాల్లోంచి వర్షం పడుతుంటే తడుస్తూ కిటికీలో నుంచి దూరంగా ఎత్తుగా నా పిల్లలు కట్టుకున్న పెద్ద భవంతి వైపు చూస్తూ... ఇంకా ఒకటి పడ్డం లేదు. చీకటైతే అన్నం పెడతారుగా అన్న ఆశతో వున్న నాకు- ఆకలిని ఎలా మరిచిపోవాలో అర్థం కావడం లేదు. నాకు చక్కెర వ్యాధి వుందని డాక్టర్ చెప్పినప్పుడు వయసు పైబడుతుంది కదా! సహజమే అన్నాడు పెద్దాడు. బి.పి. కూడా వచ్చింది అన్నప్పు డు అదీ వయసు ప్రభావమే అన్నాడు పెద్దాడికి వత్తాసు పలు కుతూ రెండోవాడు.

ఇంకా నాకు తెలియని రెండు కొత్త రోగాలను చెప్పినప్పుడు మరో రెండు ఆణిముత్యాలు అదీ సహజమే అన్నాయి.

ఇవన్నీ ఇప్పుడు నెమరు వేసుకుంటున్నా. ఆకలిని మరిచిపోవడాని కి... ఈ ఆకలికి మందు కనిపెడితే నాలాంటి పిల్లల ఆదరణకు దూరమైన దురదృష్టవంతులు ఎంతో రుణపడి ఉంటారు. ఎక్కడో పిడుగు పడింది. భయంతో అరిచాను. నా అరుపు నాకే బలహీనంగా వినపడింది. నా కళ్ళ ముందు మెరుపు మెరిసింది. ఆ మెరుపులో నా కళ్ళల్లోని సన్నటి కన్నీటి మెరుపు చూసుకున్నాను.

నా అస్తిత్వాన్ని ప్రశ్నిస్తూ నా ఉనికిని ఉలికిపాటుగా మారుస్తూ నా అంతరంగం, అంతర్మథనాన్ని ఆవిష్కరించింది.

*** ***

అప్పుడు నా వయసు పదేళ్ళు. అమ్మ చనిపోయాక, నాన్న రెండో పెళ్ళి చేసుకున్నాడు. పిన్నికి నేనంటే కోపం. నేను పుట్టకపోయి వుంటే బావుండేదట... ఆ కోపం నాన్న ముందు వ్యక్తం చేయకుండా వెనుక ముందే వ్యక్తం చేసేది. నాన్న పొలం వెళ్ళగానే నన్ను చావబాదే ది. పశువులకు గడ్డి పెట్టమనేది. ఉదయాన్నే పాలు పితకమనేది. అన్నీ చేసేవాడిని. పాచిపోయిన అన్నం నాకు, పాలేర్లకు పెట్టేది. నాన్న పొలం నుండి ఏ అర్ధరాత్రో వచ్చేవాడు. మెత్తటి పరుపుమీద పడుకున్న నన్ను చూసి తన బిడ్డ ఎంతలా సుఖ పడుతున్నాడు అనుకునేవాడు. కేవలం రాత్రి నాన్న వచ్చే ముందు పిన్ని ఇలా పరుపుమీద పడుకోబెడుతుందన్న విషయం నాన్నకు తెలియదు. నేనెప్పుడూ చెప్పలేదు.

నాకు తోడుగా మరెవరూ లేరని బాధపడేవాడిని. తరువాత నా బాధ తీరిందని సంతోషపడ్డాను. నాకు ఇద్దరు తమ్ముళ్లు, ఒక చెల్లాయి.

పిన్ని మాత్రం నాసంతోషానికి ఆనకట్ట వేసింది. వాళ్ళని తమ్ము ళ్ళు అని పిలిస్తే వీపు చీరేస్తానంది. చెల్లాయి అని పిలిస్తే పెదవుల మీద చురకలు పెడతానంది. ఓ పాలేర్లులా ఆడించాలి. అదీ ఆ ఇంట్లో నా(దు)స్థితి. ఈవిషయం నాన్నకు తెలిసింది. పిన్నితో గొడ వపడ్డాడు. పిన్ని ఎదురు తిరిగింది. నాన్న చెయ్యెత్తాడు. అంతే... ఆ చేయి శాశ్వతంగా అలాగే పడిపోయింది. పక్షవాతం నాన్నని కమ్ముకుంది. కాలు, చేయి పడిపోయి ఆ తర్వాత మాట కూడా...

ఇప్పుడు పిన్నిదే సామ్రాజ్యం. నేనక్కడ జీతం, భత్యం లేని నౌకరుని. నాన్న మూలన పడ్డంతో తనే రంగంలోకి దిగింది. పిన్ని తెలిసీ తెలియని వ్యవహారాలు...తెలియనితనం చాలామందికి లాభించింది. ముఖ్యంగా మా పిన్ని తమ్ముడు చలమయ్య మామయ్యకు. మా పిన్నికి స్వయాన తమ్ముడు. అక్కకు చేదోడు వాదోడుగా వున్నట్టు నటిస్తూ మా నాన్న చేత మా పిన్ని బలవంతంగా రాయించుకున్న ఆస్తులను, తను తెలివిగా

**కథ**





రాయించుకున్నాడు. అది తెలునుకునేసరికి ఆలస్యమైంది.

కాలం ఎవరికోసం ఆగదు. కాలంతోపాటు వచ్చే మార్పులు కూడా... విషాదాలు... వినోదాలు... కన్నీళ్ళు...కష్టాలు...ఏవైనా ఎవరి ఇష్టాలతో ప్రమేయం లేకుండా వస్తాయి. సంఘటనలూ అలాగే!

ఒక్కో సంఘటన అలా జరిగి... కాలం ఒడిలో నిద్రపోతూనే ఉంటుంది.

నాన్న చనిపోయాడు. చనిపోయిన పదవ రోజే- ఆస్తినంతా తన పేరు మీద రాయించుకున్నాక మామయ్య మా పిన్నిని బయటకు తరిమేసాడు.

పిన్నికి పెద్ద షాక్.

తట్టుకోలేని ఆ నిజాన్ని, తన పిల్లలను తీసుకొని బయటకు నడిచింది. ఊరు దాటీ, దాటకముందే కుప్పకూలి పడిపోయింది. ఈ లోకం నుంచి శాశ్వతంగా నిష్క్రమించింది.

నా తమ్ముళ్ళు కాని తమ్ముళ్ళు, చెల్లెలు ఒంటరిగా అనాథలుగా ఈ అనాథకు దొరికారు.

అక్కడనుంచి నామహా ప్రస్థానం ప్రారంభమైంది. ఆఊరి నుంచి, ఆ పరిసరాల నుంచి దూరంగా మహానగరానికి వచ్చాను.

అక్కడ ఓ స్లమ్ ఏరియాలో పెద్దపెద్ద సిమెంట్ పైపుల్లో తలదాచుకొని, తమ్ముళ్ళను చెల్లెలిని...

అలా ప్రారంభమైంది. చాలా పనులు చేసాను. నా తండ్రి రక్తం పంచుకు పుట్టిన ఆ తమ్ముళ్ళ కోసం, చెల్లెలికోసం...

బూట్ పాలిష్, హోటల్‌లో కప్పులు కడగడం- బల్లలు తుడవడం, అన్నీ...అన్నీ... చేసాను.

కాలం వేగంగా తిరిగినట్టనిపించింది. వాళ్ళు ప్రయోజకులు అయ్యారు. తమ్ముళ్ళు స్థిరపడ్డారు. చెల్లెలి పెళ్ళి చేసాను. ఎవరి బతుకు వాళ్ళ బతికే సమయంలో నేను ఒంటరివాడినయ్యాను.

ఆ ఒంటరితనానికి తోడు కోసం వెతుకుతుంటే తగిలిన ఓ ఆధారం భవాని.

తన మేనమామ తనని బలవంతంగా వ్యభిచారం రొంపిలోకి దింపుతున్నాడని పారిపోయి వచ్చిన ఆమెకు నేను ఓదార్పు నవ్వాలనుకున్నాను. ఆమెను నా దానిగా చేసుకున్నాను.

ఇప్పుడు మళ్ళీ పోరాటం...తమ్ముళ్ళ కోసం కాదు! నా భార్య కోసం. తమ్ముళ్ళు, చెల్లాయి ఇంటికి రావటం మానేసారు. ఇప్పుడు వాళ్ళకి నాతో అవసరం లేదు, రాదు. పైగా నామర్దా.

ఇది సహజమేననుకున్నా. నా జీవన పోరాటం మళ్ళీ మొదలయింది. తనని నేను కాపాడానన్న కృతజ్ఞత మంచులా కరిగిపోయింది. తనకి నేను ఏం చేసానన్న ప్రశ్న ఆమెను నిలదీసి నన్ను ఉప్పెనలా చుట్టింది.

భార్యకోసం భర్త ఏం చేయాలి? ఏమో! అందుకే నాకు తెలియని నిజాన్ని ఆమె చెబితే విని భార్యకు అవన్నీ అమర్చాలని, రెక్కలు ముక్కలు చేసుకొని ఆమెకన్నీ అమర్చి పెట్టా. ఏ అర్ధరాత్రో, అపరాత్రో వచ్చేవాడిని. శారీరకంగా, మానసికంగా అలసిపోయాను.

పిల్లలు పుట్టుకొచ్చారు...నలుగురు. చెప్పానుగా నాలుగు రత్నాలు.

బతికినన్నాళ్ళు సాధించింది నా భార్య. ఎప్పుడూ ఏదో అసంతృప్తి. తనకింకా నేను ఏదో లోటు చేసానన్న భావం. నాకు తెలిసీ నేను లోటు చేయలేదు.

చిన్నప్పుడు పిన్ని, ఆతర్వాత తమ్ముళ్ళు-చెల్లాయి, ఇప్పుడు భార్య. ఆమె చనిపోయే ముందు కూడా "నాకు అన్యాయం చేసారు. నేను చనిపోతే మీరు మరో పెళ్ళి చేసుకొని ఎలా బతుకుతారో చూస్తా"ననేది. ఆమె తత్వం నాకు అర్థమయ్యేది కాదు.

తనేమిటో తనక్కూడా అర్థం కాకుండా వెళ్ళిపోయింది.

*** ***

అక్కడితో నా భార్య పాత్ర నా జీవితం నుంచి తప్పుకుంది. తండ్రి పాత్ర మొదలైంది.

పిల్లల పట్ల శ్రద్ధ మొదలైంది. పెళ్ళి కూడా చేసుకోలేదు. పిల్లల కోసమే.

పిల్లల్ని పెంచాలి...పెద్ద చేయాలి. కనీసం వాళ్ళ దృష్టిలో నేనో సమాధానాన్ని కావాలి. అందుకే నిరంతరం ఓ యంత్రంలా పని చేసాను. ఆ నిరంతర పోరాటంలోనే అరోగ్యాన్ని కూడా లెక్క చేయలేదు. అనారోగ్యం నన్ను సమీపిస్తున్నా...మీ పిల్లలు పెద్దవాళ్ళయ్యారు. ఇక విశ్రాంతి తీసుకోమని డాక్టర్లు చెప్పినా లెక్క చేయకుండా నా పిల్లలకోసం శ్రమించాను.

ఫలితంగా... అందరికీ అన్నీ అమరాయి. 'నాకిప్పుడు గర్వంగా ఉంది' అనుకునే సమయంలో నా కొడుకులకు 'అవమానంగా' తయారయ్యాను.

శుష్కించిన శరీరం...ముడతలు పడి ముసలితనానికి చిహ్నమైన వార్ధక్యం అనే పదం... నా జబ్బులు... అన్నీ వాళ్ళకి ఇబ్బందిగా పరిణమించాయి.

కళ్ళు మసకబారాయిరా అద్దాలు కావాలంటే? ఇంకా ఈ కళ్ళతో చేసే ఘనకార్యం ఏముంది? అని కోడళ్ళ ఈసడింపును నాదంతా ఛాదస్తం, కళ్ళు బాగానే ఉన్నాయి అనే తర్జుమాతో నన్ను ఏమార్చేవారు.

దేవుడు నీలాంటి వాడి కడుపున పుట్టించి అన్యాయం చేసాడు. మేం ఏ సుఖాలూ అనుభవించాం? అని నా ముందే అంటుంటే కన్నీళ్ళు గోదారులు అయ్యాయి.

ఓ చిన్న పాడుబడ్డ గదిలోకి నన్ను మారుస్తుంటే నా మనసు చెమ్మగిల్లి చచ్చిపోయింది. మనసు చచ్చినా, శరీరం జీవచ్ఛవంలా ఉంది. ఆ జీవచ్ఛవానికి ఆకలి ఉంటుంది. అందుకే ఆకలి వేసినప్పుడు ఇలా నా ఆకలిని మరిచిపోవడానికి...అదిగో... ఆకలి అని నా మనసు ఘోషించగానే శరీరంలో ఆకలి బాధ దహిస్తోంది.

మరో గంట గడిస్తే గానీ, పనిమనిషితో పాచిపోయిన అన్నం నాకు ఆహారంగా రాదు. చిన్నప్పటి నా బాధ పునరావృతం అయింది. భూమి గుండ్రంగా ఉంటుంది కదా!

ఈలోగా నా ఆలోచనలు...నన్ను క్షుద్బాధ నుంచి తాత్కాలికంగా ఉపశమనాన్ని కలిగిస్తాయి.

ఇప్పటికీ నాకర్థం కాని శేష ప్రశ్న 'నేనెవర్ని?' ఎవరికి ఏమీ కానా? నాలాంటి వాళ్ళు చాలామంది ఉన్నారా? నా అస్తిత్వాన్ని కోల్పోయినా ఉనికిని నేనే ప్రశ్నించుకుంటూ అందరికీ అన్నీ చేసి చిన్నప్పుడు తండ్రి గుండెల మీద తెలియక తన్నిన చిన్న కూనలారా! ఇప్పుడు ఎందుకర్రా గునపాలతో ఆ గది గుండెల గోడలు పగలగొడతారు? ఎవరికీ ఏమీ కాని నాలాంటి బాధా సర్పదష్టులారా? మీకైనా తెలుసా నేనెవర్నో?

జీవచ్ఛవం...శవంగా మారకముందే ఆ నిజం తెలిస్తే చెప్పండి! మీ పిల్లలు మిమ్మల్ని జీవచ్ఛవాలుగా మార్చకముందే మేలుకోండి.

(నా చిన్నప్పుడు ముసలయ్య తాత కన్నీటితో చెప్పిన తన వెత గుర్తుకొచ్చి మనసు చెమ్మగిల్లితే రాసింది)



# తగిన ఆహారం తీసుకుంటున్నారా?

ఆహారానికీ, ఆరోగ్యానికీ సంబంధం ఉంది. తినడమంటే ఆకలి తీర్చుకోవడం కాదు, ఆబగా తినడం కాదు. తగిన ఆహారాన్ని సమపాళ్ళలో తీసుకోవాలి. అందరికీ ఒకే రకమైన ఆహారం ఉండదు. వారి వయసు, బరువు, ఆరోగ్య పరిస్థితులను అనుసరించి ఎలాంటి ఆహారం తీసుకోవాలో నిర్ధారించుకోవాలి. అయితే అందరికీ సాధారణంగా ఉండే అంశాలు కూడా ఉంటాయి. దీనికి సంబంధించి కొన్ని అంశాలు గుర్తుంచుకోవాలి.

* లావుగా ఉన్నవారు లేదా లావెక్కే శరీరతత్వం ఉన్నవారు కొవ్వు పదార్థాల్ని తీసుకోకూడదు. నూనె వంటకాల్ని తీసుకోవడం శ్రేయస్కరం కాదు. అతిగా తినడం కూడా సరికాదు. తమకు తగిన ఆహారమేదో న్యూట్రిషియన్‌తో సంప్రదించి నిర్ధారించుకోవడం అవసరం.

* అలాగే ముప్పయి అయిదేళ్ళు దాటినవారు అతిగా తినకూడదు. సాధారణంగా వయసు పెరుగుతుంటే తీసుకునే ఆహారం పాళ్ళు తక్కువగా ఉండాలంటారు. అయితే ఎంత పరిమాణం ఉండాలో శాస్త్రీయంగా నిర్ధారించుకోవాలి. అంతేగానీ ఆహారాన్ని మీ ఇష్టానుసారం తగ్గించడం పద్ధతి కాదు.

* ఏ వయసు వారయినా తీసుకోదగిన ఆహారం పండ్లు, పచ్చి కూరగాయలు. కీరా, క్యారెట్ లాంటివి తీసుకోవడం వల్ల ఎలాంటి నష్టం ఉండదు. అలాగే ఆయా కాలాలకి తగినట్టుగా తగిన పండ్లు, పండ్ల రసాలు తీసుకోవాలి. ఉదయం పూట, సాయంత్రం పూట నూనె వంటకాల కన్నా పండ్లు, పండ్ల రసాలు ఆహారంగా స్వీకరించడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

* పిల్లలకి కూడా చిరుతిళ్ళకి బదులుగా పండ్లరసాలు, పండ్లు ఇవ్వడం ఉత్తమం. బిస్కెట్లు, చాక్లెట్లు, చిప్స్ ప్యాకెట్లు వారి ఆరోగ్యానికి హాని చేసే అవకాశం లేకపోలేదు. కనుక వారికి పండ్లు తినే అలవాటు చేయాలి. పండ్లరసాలు ఇవ్వాలి.

* భోజన సమయంలో పెరుగుకి బదులుగా మజ్జిగ వాడటం మంచిది. మజ్జిగ తాగడం ఎంతో ఉపయుక్తం.

* కొందరి ఇళ్ళలో ఏదైనా ఇష్టమైన వంటకం తయారు చేస్తే పిల్లలు భోజనం కూడా మానేసి ఆ వంటకాన్ని లాగించేస్తుంటారు. కానీ అతి పనికిరాదని గుర్తుపెట్టుకోండి. ఏది ఎంతవరకు అవసరమో అంతే తినడం ఆరోగ్యానికి మంచిది. కనుక పిల్లల తిండి అలవాట్లు సరిగా ఉండేలా అమ్మానాన్నలు చూసుకోవాలి.

* బయటి ఆహారం కన్నా ఇంట్లో చేసుకుని తినడం అన్నివిధాల శ్రేయస్కరం. బయట రోడ్ల పక్కన ఉండే స్థలాల్లోని ఆహారాన్ని తినడం మంచిది కాదు. ఎందుకంటే రోడ్డు మీద ఉండే కాలుష్యం ఒక కారణం. వారు ఏయే పదార్థాల మిశ్రమంతో తయారు చేస్తున్నారో మనకు తెలియకపోవడం మరో కారణం. కనుక ఇష్టమైన వంటకాన్ని వీలైనంత మటుకు ఇంట్లోనే చేసుకుని తినడం ఉత్తమం.

– ఉదయిని